

విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న మహేష్ కోటే

## స్పందన ఫౌండేషన్ ఆధ్వర్యంలో

# పేద విద్యార్థులకు పుస్తకాల పంపిణీ

షోలాపూర్, జులై 21 (న్యూస్ టుడే): అమెరికాలో ఉద్యోగం, వ్యాపార రంగాల్లో రాణిస్తున్న ప్రవాస భారతీయులు పట్టణంలోని 125 మంది ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫారాల్ని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం పద్మశాలి శిక్షణ మండలి అధ్యక్షుడు మహేష్ కోటే చేతుల మీదుగా సోమవారం జరిగింది. ప్రవాస భారతీయులందరూ ఏకమై జన్మభూమి కోసం ఏదైనా చేయాలనే సంకల్పంతో 'స్పందన ఫౌండేషన్'ను స్థాపించారు. దీని ద్వారా భారత దేశంలో వివిధ ప్రాంతాల్లో ఉన్న పేద, నిరాశ్రయులకు చేయూతనిస్తూ వస్తున్నారు. ఇళ్లు కోల్పోయిన వారికి పునరావాసం, పేద విద్యార్థులకు ఆర్థిక సాయం తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. దీన్ని తొలుత దక్షిణ భారత్‌లో ప్రారంభించారు. ప్రస్తుతం షోలాపూర్‌కూ విస్తరింపజేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విలాస్ బేత్ అధ్యక్షత వహించగా స్పందన ఫౌండేషన్ స్థానిక ప్రతినిధి గాలపల్లి దత్తాత్రేయ పాల్గొన్నారు.